
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
మంగళవారం 8 జూలై 2025

బైక్‌పై 5,300 కి.మీ. ప్రయాణం
● హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ 12 రాష్ట్రాల్లో కానిస్టేబుల్ పర్యటన 8

పాఠశాలల అభివృద్ధికి సహకారం ప్రశంసనీయం
● బడుల దత్తత గర్వకారణం
● విశ్వనాథ్ చౌదరిని ఆదర్శంగా తీసుకోవాలి: విద్యాశాఖాధికారి బసవలింగప్ప హుడేద్

చలో ఢిల్లీ..!

● నేడు హస్తినకు డీసీఎం డీకే శివకుమార్.. రేపు సీఎం
● వరుస పర్యటనలపై ఉత్కంఠ ● బెంగళూరులో సుర్జేవాలా మకాం





బెంగళూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయం వేడెక్కుతోంది. ఇటీవలే సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిని అంటూ ప్రకటించాక ఆయన అనుచరులలో ఎనలేని సంతోషం వ్యక్తం అవుతోంది. సీఎం పదవే లక్ష్యంగా భావిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ కూడా మరో ప్రత్యామ్నాయం లేక సీఎం సిద్దరామయ్యకు మద్దతు ఇస్తున్నానంటూ ప్రకటించారు. మరోవైపు అధిష్ఠానం ఆదేశాలను పాటించడమే తన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలు ప్రభుత్వ పథకాలతోపాటు అభివృద్ధికి గ్రాంట్లు మంజూరు కావడం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీంతో పార్టీలో డ్యామేజ్‌ను నియంత్రించేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా ఇటీవలే బెంగళూరులో మకాం వేశారు. కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలతో సుదీర్ఘమైన అభిప్రాయ సేకరణ కొనసాగించారు. రెండో విడతగా సుర్జేవాలా సోమవారం బెంగళూరుకు చేరుకున్నారు. ఆయన 2-3 రోజులు బెంగళూరులోనే ఉండనున్నారు. తొలివిడతలో బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాల ఎమ్మెల్యేలు, మంత్రులతో భేటీ అయిన సుర్జేవాలా ప్రస్తుతం ఉత్తర కర్ణాటక ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. ప్రత్యేకంగా రూపొందించుకున్న ప్రశ్నావళిని ఆయన నమోదు చేసుకుంటున్నారు. ఇలా సాగుతుండగానే డీసీఎం ఢిల్లీ పర్యటన రేకెత్తిస్తోంది. మంగళవారం డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్తున్నారు. బుధవారం సీఎం సిద్దరామయ్య హస్తినకు చేరుకోన్నారు. ఇలా ఇద్దరు ప్రముఖులు ఢిల్లీకి వెళ్లనుండడం, సుర్జేవాలా బెంగళూరులోనే గడపడం కొత్త ఆలోచనలకు తెర లేస్తోంది. సీఎం సిద్దరామయ్యకు ఏఐసీసీ ఓబీసీ కమిటీ సభ్యుడిగా పార్టీ నియమించింది. రాష్ట్రానికి చెందిన బీకే హరిప్రసాద్, వీరప్పమొయిలీలు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సిద్దరామయ్య తొలి పేరు ఉండడంతో ఓబీసీ కమిటీ అధ్యక్షుడు సిద్దరామయ్య అంటూ ప్రచారం సాగింది. చివరకు సీఎంఓ వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం సిద్దరామయ్య శేషాద్రిపురం పరిధిలోని అపోలో ఆసుపత్రికి వెళ్లారు. ఇటీవల ఆయన మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణమైన పరీక్షలకే ఆసుపత్రికి వెళ్లారు. సీఎం వెంట మంత్రి జమీర్ అహ్మద్, కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర ఉన్నారు.

ఆరా..!





● ఆన్‌లైన్ ఆటలపై ఉక్కుపాదం ● బెట్టింగ్ నియంత్రణకు కఠిన చర్యలు ● పట్టుబడితే మూడేళ్ల జైలు.. రూ.లక్ష జరిమానా



బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటలపై ప్రభుత్వం కఠినచర్యలకు సిద్ధం అయ్యింది. యువతను పెడదోవ పట్టించి ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తున్న జూదంపై ఉక్కుపాదం మోపనుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా దాదాపు అందరివద్దా స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. నేటి యువతకు చదువుమీదకంటే మొబైల్‌మీదే ధ్యాస పెరిగిందని అందరికీ తెలిసిందే. ప్రతి ఒక్కరూ సోషల్‌మీడియాను వాడుతున్నారు. ఈ తరుణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మొబైల్‌కు బానిసలు కారాదని పలువురు సలహా సూచనలు ఇస్తున్నా యువత పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ప్రత్యేకించి యువత జీవితాన్ని కొల్లగొడువుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌కు, పేకాటకు అడ్డుకట్ట వేసేలా రాష్ట్రప్రభుత్వం కఠిన చట్టాలు తెచ్చేందుకు సిద్ధమైంది. అనధికార ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానాతోపాటు ప్రకటనలు, ఇతర మార్గాల ద్వారా పేకాటను ప్రోత్సహించేలా చేసేవారికి 6 నెలల జైలుశిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించేలా బిల్లును సిద్ధం చేశారు.

మైక్రోఫైనాన్స్ దందాకు అడ్డుకట్ట తరహాలో..

అనధికార మైక్రోఫైనాన్స్ దందా, బలవంతపు వసూళ్లను నియంత్రించేలా చట్టాన్ని రూపొందించిన ప్రభుత్వం అదే తరహాలో ఆన్‌లైన్ బెట్టింగ్ దందాకు అడ్డుకట్ట వేసేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేలా అడుగులు వేస్తోంది. మైక్రో ఫైనాన్స్ బిల్లుకు గవర్నర్ పలుమార్లు స్పష్టీకరణ కోరారు. ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సంబంధించి చట్ట రూపకల్పనలో పొరుగున ఉన్న తమిళనాడు ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం గమనించింది. ఆన్‌లైన్ గేమింగ్ అనేది ఒక పారిశ్రామిక రంగంలా రూపుదిద్దుకున్న తరుణంలో ఈ అంశాలను సూక్ష్మంగా అవలోకించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ కూడా అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

నియంత్రణకు ప్రాధికార ఏర్పాటు

చట్టాలు, ప్రజా సేవ, సాంకేతికరంగంలో అనుభవం, నిపుణులైన వారి నేతృత్వంలో 'కర్ణాటక ఆన్‌లైన్ గేమింగ్ అండ్ బెట్టింగ్ నియంత్రణ ప్రాధికార' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో సాంఘిక సంక్షేమ, ఐటీ, ఆర్థిక నిపుణులను నియమించనున్నారు. ప్రామాణిక పరిశ్రమ, న్యాయ పరిధికి లోబడి ఈ అదృష్ట, నైపుణ్యమైన ఆటను స్పష్టంగా గుర్తించేలా ప్రాధికార పని చేయనుంది.

ప్రాధికార బాధ్యతలు ఏమిటి..?

నైపుణ్యాధారిత ఆటల వేదిక నిర్వాహకులకు అనుమతులు, ప్రతి మూడేళ్లకోసారి రెన్యూవల్ అంశాలు ప్రాధికార బాధ్యతలుగా ఉంటాయి. అంతేకాక అనధికార ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర అక్రమ దందాలపై నిఘా, కాలానికి అనుగుణంగా దాడులు, ఆన్‌లైన్ పేకాట వల్ల కలిగే అపాయాలపై జాగృతి నిర్వహించడం కూడా ప్రాధికార బాధ్యతలుగా ఉన్నాయి.



బాధితులకు అండగా..

ప్రమాదకరమైన ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి అందులో కూరుకుపోయి, వంచనకు గురైన వారికి చట్టపరంగా అండగా ఉండడంతో పాటు వారిలో చైతన్యం కల్పించాలని నిర్ణయించారు. సమాజహితం కోసం పాటుపడే సంఘసంస్థలతో కలసి ప్రాధికార పనిచేయనుంది. హెల్ప్‌లైన్ ఏర్పాటు, బాధితుడు, సోషల్‌మీడియా ద్వారా ప్రముఖులతో అనధికార ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కలిగే సమస్యలపై ప్రజలలో చైతన్యం కలిగించనున్నారు.

అనుమతులకు అర్హతలు

వ్యక్తి లేదా సంస్థ ఎవరైనా సరే ఆన్‌లైన్ గేమ్ ప్రారంభించే ముందు ప్రాధికారకు అర్జీ సమర్పించాల్సి ఉంటుంది. కేవైసీ పరిశీలన, అక్రమ నగదు బదిలీ లేకుండా నియమాలు పాటించడం, గేమ్‌లో పాల్గొనేవారు 18ఏళ్ల పైబడినట్లుగా నిర్ధారించుకోవడం, సాధ్యం కాని బహుమతులను ప్రకటించడం లేదా ప్రకటనలు ఇవ్వరాదు. ఇలా పలు నియమ నిబంధనలు విధించనున్నారు. చట్టరీత్యా అనుమతి లేకుండానే నమోదు చేసుకోకుండా వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఇతర డిజిటల్ వేదికల ఆధారంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడ్డం, ఇతర పేకాట ఆడడం అనధికార వేదికలుగా పరిగణిస్తారు.

బిల్లులో ఏం ఉందంటే..?

గేమ్ ఆఫ్ చాన్స్ (అదృష్టపు ఆట), గేమ్ ఆఫ్ స్కిల్ (నైపుణ్య ఆట) అని విభజించి కర్ణాటక పోలీస్ యాక్ట్ 2025ను బిల్లులో ప్రస్తావించినట్లు సమాచారం. కర్ణాటక పోలీస్ యాక్ట్ 1963 (1964 కర్ణాటక చట్టం 4) సెక్షన్ 2కు పలు క్లాజ్‌లు, సబ్‌క్లాజ్‌లు, ఇతరత్రా చేర్చనున్నారు.

ప్రధాన అంశాలు

అనధికార ఆన్‌లైన్ వేదికలు, నిర్వాహకులను గుర్తించేందుకు సైబర్ పోలీసుల కార్యాచరణ ఉంటుంది. అలాగే సోషల్‌మీడియా, సెర్చ్ ఇంజన్‌ల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించారు. ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి హెల్ప్‌లైన్ అందుబాటులోకి తేనున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు సమయం నిర్ణయించడం, పాల్గొనేవారు, ఎంత మొత్తం బెట్టింగ్ వేశారు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి మూడు నెలలకోసారి ప్రాధికారకు ససమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే క్రిమినల్ దావా, చట్టరీత్యా చర్యలు ఉంటాయి. నిందితులను త్వరగా విచారించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు, ప్రజలు ఫిర్యాదు చేసేలా అవకాశం, అత్యవసర సందర్భాలలో తప్ప విజిల్ బ్రోవర్‌లను గుర్తించడం, పరిచయం గోప్యంగా ఉంచడం, అనధికార బెట్టింగ్ దందా గురించి తెలియచేసేవారికి తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం.

హఠాన్మరణాలకు పోస్టుమార్టం

తప్పనిసరి

● గుండెపోటు మరణాలపై నివేదిక సమర్పణ
● కొవిడ్ తర్వాత పెరిగిన హృదయ సమస్యలు
● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్‌గుండూరావు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దినేశ్‌గుండూరావు

బెంగళూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై హఠాత్ మరణాలకు పోస్టుమార్టం తప్పనిసరి చేశామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అన్నారు. సోమవారం వికాససౌధలో మంత్రి మీడియాతో మాట్లాడారు. అంతకుముందు హాసన్ జిల్లాతోపాటు పలు ప్రాంతాలలో హఠాత్తుగా గుండెపోటు మరణాలు అధికం కావడంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదికను మంత్రికి సమర్పించింది. జయదేవ హృద్రోగ సంస్థల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నివేదికను అందజేసింది. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కొవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావంతో గుండెపోట్లు సంభవించలేదని ఇప్పటికే పలు నివేదికలు రుజువు చేశాయన్నారు. తాజాగా రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలోనూ అదే నిజమైందన్నారు. కొవిడ్ తర్వాత గుండె సంబంధిత జబ్బులు అధికమయ్యాయని, అయితే వ్యాక్సిన్ కారణం కాదనేది స్పష్టంగా తేలిందన్నారు. కొవిడ్ తర్వాత మధుమేహ బాధితులు గణనీయంగా పెరిగారని, అది గుండెపోటుకు ఓ కారణమై ఉండవచ్చునని కమిటీ తన నివేదికలో అభిప్రాయపడిందన్నారు. కొవిడ్ వైరస్‌తో శరీరంలో పలు పరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. ఇతర మందులు తీసుకోవడం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, టీవీ కంప్యూటర్ల ముందు అధిక సమయం గడపడం కూడా గుండెపోటుకు కారణాలు కావచ్చునన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నివేదికలో ఇవే అంశాలను ప్రతిపాదించాయని మంత్రి తెలిపారు. హఠాత్ మరణాలకు ఇకపై పోస్టుమార్టం తప్పనిసరిగా జరుపుతామన్నారు. నిపుణుల కమిటీ నివేదికను అధ్యయనం చేసి సిఫారసులను అమలు చేస్తామన్నారు. పునీత్‌కుమార్ హృదయజ్యోతి పథకం తాలూకా ఆసుపత్రుల్లోనూ అమలు చేస్తామన్నారు.

కలుషిత నీరు తాగి ముగ్గురి మృతి

● యాదగిరి జిల్లాలో ఘటన ● పలువురి పరిస్థితి విషమం

బెంగళూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా సురపుర తాలూకా తిప్పనటగి గ్రామంలో కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురైన ముగ్గురు మృత్యువాత చెందారు. దేవికమ్మ హొట్టి (48), వెంకమ్మ (60), రామణ్ణ పూజారి (50), అనే వారు మృతి చెందారు. పదిరోజులక్రితం మంచినీరు తాగిన తిప్పనటగి గ్రామస్థులు వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారు. వీరిని సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. వీరిలో ఈ ముగ్గురు చికిత్స ఫలించక సోమవారం కన్ను మూశారు. ఆస్పత్రిలో పలువురు కోలుకుంటున్నారు. మరో 20మంది చికిత్స పొందుతున్నారు. తిప్పనటగి గ్రామాన్ని సురపుర తాలూకా ఆరోగ్య అధికారి రాజా వెంకటప్ప నాయక్ పరిశీలించారు.

రేపు మధ్యాహ్న భోజన ఉద్యోగుల నిరసన 7
● సమస్యలను పరిష్కరించాలని వినతి

కర్ణాటకలో ఎస్సీ వర్గీకరణ సర్వే బోగస్

● ముంబైలో అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ విమర్శలు ● విజయవంతం చేశారంటూ నగరంలో జస్టిస్ నాగమోహన్ దాస్‌కు అభినందనలు

బెంగళూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఎస్సీ వర్గీకరణ అమలు కోసం జరుపుతున్న సర్వే ఓ బోగస్ అని రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ మనవడు, బహుజన అఘాడి వ్యవస్థాపకులు ప్రకాశ్ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. ఎస్సీ సర్వేను బోగస్ రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో జరుపుతోందని మండిపడ్డారు. ముంబైలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అయితే కర్ణాటకకు సంబంధించిన అంశంపై సర్వత్రా చర్చనీయాంశం అవుతున్నాయి. ఇంట్లో ఉంటున్నవారితో మాట్లాడకుండానే సర్వే చేస్తున్నారని, తద్వారా వాస్తవ స్థితిగతులు, సమాచారం ఎలా సాధ్యమన్నారు. ఇళ్లకు రహస్యంగా వెళ్లి నోటీసులు అంటిస్తున్నారని, ఇది ఏ విధంగా చట్టబద్ధమైన సమీక్షగా భావించాలని ప్రశ్నించారు. ఇటువంటి బోగస్ సర్వేలతో ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఎస్సీ ఉపకులాలను తప్పుడు గణాంకాలతో నమోదు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నినట్లు ఉందన్నారు. ప్రభుత్వ పరిధిలో సంక్షేమాలకు బడ్జెట్‌లో వారి ప్రాతినిధ్యం తగ్గించేందుకు కుట్ర సాగుతోందని ఆరోపించారు. ఎస్సీ కులాలను మోసం చేసే ఉద్దేశ్యంతో జరుపుతున్నారన్నారు. కర్ణాటకలో సర్వేపై స్పందించాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, సీఎం సిద్దరామయ్యలను కోరారు.

జస్టిస్ నాగమోహన్‌దాస్‌కు సన్మానం

కాగా ఎస్సీ వర్గీకరణకోసం జస్టిస్ నాగమోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన సర్వే విజయవంతమైందని పలువురు అభినందించారు. ఈమేరకు సోమవారం జస్టిస్ నాగమోహన్‌దాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆంజనేయ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగ, చలవాది, ఏకే, ఏడీ, ఆది ఆంధ్ర పేరుతో గుర్తింపు పొందిన గందరగోళానికి సర్వే ఒక నిర్దేశం ఇవ్వనుందన్నారు. ఎస్సీలలో అన్ని ఉపకులాల మూలకులంతోపాటు ఆర్థిక, సామాజిక, విద్య పరిస్థితిని నిర్దేశిస్తుందన్నారు. మే 5న ప్రారంభమైన సర్వే రాష్ట్ర వ్యాప్తంగా జూన్ ఆఖరుతో ముగిసిందని, బెంగళూరులో ఈనెల 6వ తేదీ వరకు కొనసాగిందన్నారు. మాజీ ఎంపీ బీఎం చంద్రప్ప, దళిత నేతలు కేజే జగదీశ్, కోగిలు వెంకటేశ్, ముత్తురాజ్‌తో పాటు పలువురు ఉన్నారు.

వర్గీకరణ అమలుకు కట్టుబడ్డాం: హోం మంత్రి పరమేశ్వర్

ఇదే విషయమై హోం మంత్రి పరమేశ్వర్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకే సర్వే జరుపుతున్నామన్నారు. రాష్ట్రంలో 2.50 లక్షల ఉద్యోగాల నియామకాలు జరగాల్సి ఉందని, ఇందులో 18వేలు పోలీసుశాఖలో ఉన్నాయన్నారు. జైళ్లశాఖలో 38శాతం ఖాళీలు ఉన్నాయన్నారు. వర్గీకరణ అంశం తీర్మానమయ్యేంతవరకు నియామకాలు, పదోన్నతులు జరగకుండా ప్రభుత్వం కఠినమైన నిర్ణయం తీసుకుందన్నారు.



జస్టిస్ నాగమోహన్‌దాస్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆంజనేయ

ఉప్పొంగుతున్న తుంగభద్రమ్మ



నీట మునిగిన మోటార్లను బయటకు తీస్తున్న రైతులు

కంప్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్రమ్మ ఉప్పొంగి ప్రవహిస్తోంది. కాలవల్లో ఉధృతికి మోటర్లు నీట మునిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని బెళగోడుహాళ్, సన్నాపురం, నారాయణ స్వామి క్యాంపు, ఇటిగి, మున్నూరుసూగూరు గ్రామాల రైతులు మోటార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా నారాయణ స్వామి క్యాంపు రైతు రమణయ్య, అచ్యుత్ మాట్లాడుతూ ఇప్పడిప్పుడే వరి నాట్లు ప్రారంభించామన్నారు, కానీ నదికి ఎక్కువ నీరు రావడంతో మోటార్లకు నీరు చేరుకుని పాడయిపోయాయన్నారు. ఒక్కో మోటారు రిపేరీకు రూ. 10 వేలు ఖర్చవుతుందన్నారు. దీనికి తోడు నాట్లు కూడా ఆలస్యం అవుతున్నాయన్నారు. నదిని నమ్ముకుని పంటలు వేసుకున్న రైతులకు ప్రతి యేటా ఈ కష్టాలు తప్పడం లేదన్నారు. ఈ సారి నీరు ముందే రావడంతో మరిన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. పొలాల్లో సేద్యం చేసుకుని నాట్లకు సిద్ధంగా వుంచాము. అంతలోగానే మోటార్లు కాలిపోయి ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మరమ్మతులకు వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు.

గట్టుకు చేరిన తెప్పలు...

దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపిపుణ్యక్షేత్రంలో నదిఒడ్డున వుండే కోదండరామస్వామి దేవస్థానం వద్ద తెప్పలు గట్టుకు చేరాయి. ఆ ప్రాంతంలో యాత్రికులు కోదండరామస్వామి దేవస్థానం యంత్రోత్పాదక ఆంజనేయస్వామి దర్శించుకుని తెప్పలపై నది అటుపై అంజనేయస్వామి జన్మస్థలంకు అంజనాద్రి కొండకు చేరుకునేవారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని తిరిగి తిప్పలపైన ఇటువైపు వచ్చేవారు కానీ నదిలో నీరు ఉధృతంగా పారుతుండంతో తెప్ప ప్రయాణం ఆగిపోయింది. ప్రతి యేటా నదికి నీరు ఎక్కువగా పోటెత్తితే తమ జీవనానికి ఇబ్బంది తప్పదని తెప్పదారులు వాపోతున్నారు. తుంగభద్రమ్మ శాంతించేవరకు తమకు ఎలాంటి పనులు వుండవని తెలిపారు. అప్పటివరకు తెప్పల్ని గట్టుపైనే వుంచుతామన్నారు. తెప్పలకు కాస్తో కూస్తో రిపేరు వుండినట్లయితే నదికి నీళ్లు తగ్గేలోపుగా ఆ పనులు చేపట్టుకుని యాత్రకు అనుగుణంగా తెప్పలను సిద్ధం చేసుకుంటామన్నారు.



పైపులను తొలగిస్తున్న కూలీలు, రైతులు



కోదండరామ దేవస్థానం గట్టుపై ఉంచిన తెప్పలు

క్రైం కార్నర్

గంజాయి స్వాధీనం..10 మంది అరెస్ట్


పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

రాయదుర్గం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి రాయదుర్గం ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలించి విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేసి 1.709 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ జయ నాయక్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో గంజాయి విక్రయానికి అలవాటు పడ్డారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి తీసుకొచ్చి రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలలో విక్రయించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. బళ్లారిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో ఉన్న సాధువుల దగ్గర కిలో రూ. 25 వేలు ప్రకారం కొనుగోలు చేసి రైలు మార్గం ద్వారా జిల్లాలోకి ప్రవేశించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చుకుని విక్రయించేందుకు సిద్ధంగా పెట్టుకున్న కంబదూరు మండలంలోని కర్తనపర్తి గ్రామానికి చెందిన బోయ నరేష్, కొత్తూరు గ్రామానికి చెందిన కోడిపల్లి రామాంజనేయులు, చెన్నంపల్లికి చెందిన మారన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చిట్ట మారప్ప, అనంతపురం మండలం పులకుంట గ్రామానికి చెందిన వెంకటరాముడు, నగరానికి దంపట్ల జీవన్‌కుమార్, బండి ఉదయ్ కిరణ్, ఇమామ్‌సాబ్, షేక్ అన్వర్‌బాష, గార్లదిన్నె మండలంలోని పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్‌లు సమూహంగా ఏర్పడ్డారు. రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద వీరిని అదుపులో తీసుకున్నామని అన్నారు. వీరి వద్ద నుంచి 1.709 కిలోల గంజాయితో పాటు ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


విష్ణువర్ధన్ (ఫైల్)

చిలమత్తూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ (30) ప్రేమ విఫలమై సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణప్ప కుమారుడు విష్ణువర్ధన్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి దూరమవడంతో తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. దాంతో కొన్నాళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించేసరికి మరణించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా.. గొలుసు అపహరణ


పుష్పవతి మెడకు గాయం

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరు గ్రామం వద్ద సోమవారంతెల్లవారుజామున నెట్టెం పుష్పవతి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. బీ పప్పూరు గ్రామానికి చెందిన నెట్టెం కృష్ణయ్య భార్య పుష్పవతి రోజులాగానే రోడ్డు వైపు వాకింగ్‌కు వెళ్లింది. ఒంటరిగా వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన దుండగుడు.. ఆమె మెడలోని మూడు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. దీంతో పుష్పవతి మెడ, మోకాళ్లకు గాయాలయ్యాయి. పుష్పవతి.. గ్రామస్థులను తీసుకొచ్చేలోగా దుండగుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గగన్ అనే బాలుడు సోమవారం విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, పవిత్ర తెలిపిన వివరాల మేరకు.. ఆరేళ్ల వయస్సున్న గగన్ పశువుల ఆసుపత్రి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కట్టె వెళ్లి విద్యుత్ వైర్లకు తగినట్లు చెప్పారు. విద్యుత్ షాక్ తగలడంతో స్పృహతప్పి పోయాడని, ఎడవచేయి భాగంతో పాటు మెడపూర్తిగా కాలిపోయిందన్నారు. చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించామని అన్నారు.

మహిళ అదృశ్యం

కదిరిఅర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళ అదశ్యంపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కౌలేపల్లికి చెందిన వివాహిత సాయిలీలా ఈనెల 1న ఇంటిలో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదన్నారు. భర్త, కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకి లేకపోవడంతో సోమవారం భర్త శీను పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్నట్లు చెప్పారు.

ఎవరిదో..?

● వారం రోజులుగా రోడ్డుపైనే కారు



రోడ్డుపై వదిలేసిన కారు

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లికి వెళ్లే రోడ్డు పక్కన కారు వారం రోజులుగా ఉంది. ఎవరిదో తెలీదు. ఎవరూ తీసుకెళ్లట్లేదు. రోడ్డుపై వెళ్లే వారు కారుపై చర్చించుకుంటున్నారు. పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని తెలిసింది. కారు రెండు చక్రాలు పంచర్ అయినట్లు తెలిసింది. దొంగలు వదిలేసి వెళ్లారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్‌ఐ సాగర్‌ను అడగ్గా.. విచారణ చేస్తున్నామనీ, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యం

● డబ్బు కట్టలేదంటూ దాడి
● వన్‌టౌన్ వద్ద బంగారు వ్యాపారుల ఆందోళన
● ఐదుగురిపై కేసు నమోదు
● అధిక వడ్డీ వసూలు చేస్తే తాట తీస్తాం: సీఐ


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): వడ్డీకి తీసుకున్న డబ్బు కట్టలేదంటూ... కొందరు వడ్డీ వ్యాపారులు.. దాడి చేయడం పాతూరులో పెద్దదుమారం రేపింది. బాధితులకు అండగా కొందరు బంగారు వ్యాపారులు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అధిక వడ్డీలు వసూలు చేస్తే... తాట తీస్తామని, నడిరోడ్డుపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తామంటూ సీఐ శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారు వ్యాపారి బాబ్‌జాన్.. భవానీనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి తిరుపాల్ వద్ద రూ.2 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఐదేళ్ల క్రితం తీసుకున్న డబ్బుకు నెలనెలా రూ.40వేల వరకూ చెల్లించాడు. ఇక వడ్డీ కట్టలేననీ, రూ.2 లక్షల మొత్తాన్ని రూ.50వేల చొప్పున నాలుగు విడతల్లో చెల్లిస్తానని వ్యాపారి చెప్పుకున్నాడు. ఉదయం ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో...తిరుపాల్, అతడి కుమారుడు సూరి, మరో ముగ్గురు అనుచరులతో కలిసి పాతూరులోని బాబ్‌జాన్ షాపు వద్దకు వచ్చి నిలదీశారు. డబ్బు ఎందుకు ఇవ్వలేదంటూ బాబ్‌జాన్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న బంగారు షాపుల యజమానులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వారు వినలేదు. బాధితుడితో కలిసి బంగారు వ్యాపారులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకెళ్లి ఆందోళన చేశారు. కొంతసేపు వన్‌టౌన్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్‌ఐ శ్రీనివాస్.. నిందితులు తిరుపాల్, సూరి, సోము, అంజి, అసం అలీని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. బాధితులకు సీఐ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

అధిక వడ్డీల కోసం పీడిస్తే... తాట తీస్తాం : సీఐ శ్రీకాంత్ యాదవ్

అధిక వడ్డీల కోసం జనాలను పీడిస్తే తాట తీస్తాం. అలా వేధిస్తుంటే... బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. కఠిన చర్యలు తీసుకుంటాం. వడ్డీ వ్యాపారులు ప్రాంసరీ నోట్ ఉంటే.. కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలే తప్ప.. ఇలా ఇళ్ల వద్దకు వెళ్లి దౌర్జన్యాలు చేయడం సరికాదు. నడిరోడ్డులోనే పనిష్మెంట్ ఇస్తాం. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తాం.

మెగా పీటీఎంపై కసరత్తు

విద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలతో కమిటీలు
కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు

అనంతపురం విద్య, జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీన పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించ తలపెట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం)పై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పీటీఎం నిర్వహణపై కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. పీటీఎం నిర్వహణలో ఇతర శాఖలు భాగస్వాములు కావాలని ఆదేశించారు. తల్లి పేరున పిల్లలతో తప్పనిసరిగా మొక్కలు నాటించాలని, ఆ మొక్కకు విద్యార్థి పేరుతో జీపీఎస్ ట్యాగ్‌చేసి పెంచే బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలిచ్చారు. ఇందుకు విద్యార్థికిగ్రీన్ పాస్‌పోర్టు జారీ చేయనున్నారు. దీంతోవిద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ, అటవీ శాఖాధికారులు, సిబ్బందితో సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ సెంటర్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ, నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తూ బాధ్యతలు అప్పగించారు. అక్కడ కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కాన్ఫరెన్స్‌లలో మాట్లాడుతున్నారు. పీటీఎం నిర్వహణపై మార్గదర్శకాలు ఇస్తున్నారు.

1,747 స్కూళ్లకు రూ. 2.75 కోట్లు జమ

పీటీఎం నిర్వహణ తేదీ దగ్గర పడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేసింది. తొలివిడతలో 50శాతం గ్రాంట్ విడుదల చేసింది. జిల్లాలోని 1,747 స్కూళ్లకు రూ.2.75 కోట్లు విడుదలకాగా.. ఆ సొమ్మును ఏపీసీ శైలజ.. ఆయా పాఠశాలలకు పిల్లల సంఖ్యను బట్టి జమ చేశారు. ఈ నిధుల్లో 20 శాతం పీటీఎం నిర్వహణకు వినియోగించుకోవచ్చని ఏపీసీ తెలిపారు. మొత్తంమీద విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పీటీఎం నిర్వహణ ఏర్పాట్లపై తలమునకలవుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెర (వయా గుంతకల్లు) ప్రత్యేక వీక్లీ రైలు (నం 07079) ఈ నెల 17వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ ప్రతి ఆదివారం సాయంత్రం సికింద్రాబాదులో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07080) ఈ నెల 14వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మంగళవారం ఉదయం 7-45 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు. హైదరాబాద్-అరిసికెరె (వయా డోన్-అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07069) ఈ నెల 8వ తేదీ నుంచి ఆగస్టు 26వ తేదీ వరకూ ప్రతి మంగళవారం సాయంత్రం 7-20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.07070) బుధవారాలలో మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు హైదరాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం ధర్మవరం, హిందూపురం, యలహంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే కాచిగూడ-తిరుపతి (నం. 07676) ప్రత్యేక సింగిల్ ట్రిప్ రైలు ఈ నెల 8వ తేదీ ఉదయం కాచిగూడలో రాత్రి 11-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం పన్నెండున్నరకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలిపారు.

వందే భారత్ రైలుకు అదనపు కోచ్‌లు

కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (నం. 20703/04) రైలుకు 8 రైలు కోచ్‌లను పెంచి నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది చైర్‌కార్లతో వెళ్తున్న ఈ వందే భారత్ రైలుకు మరో ఎనిమిది చైర్‌కార్లను జతచేయనున్నట్లు తెలిపారు. ఈ రైలుకు ప్రయాణికుల ఆదరణ ఎక్కువగా ఉండటంతో ప్యాసింజర్ రవాణా సామర్థ్యాన్ని రెండింతలు చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచీ వందే భారత్ అప్ అండ్ డౌన్ రైలుకు ఏడు చైర్‌కార్ల స్థానంలో 14, ఒక ఎక్జిక్యూటివ్ క్లాస్ చైర్‌కార్ స్థానంలో రెండు ఉండేలా, 530 ప్రయాణికుల స్థానంలో 1,128 మంది ప్రయాణించేలా సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వివరించారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

రామగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామ సమీపాన సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడి సాయికుమార్(23) దుర్మరణం చెందాడు. పేరూరుకు చెందిన వెల్డింగ్ మల్లేశ్ కుమారుడు సాయికుమార్ ట్రాక్టర్ తోలుకుంటూ ఇంటికి వస్తుండగా అదుపు తప్పి, పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. సాయికుమార్ మీద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్‌కు భార్య అంజలి, నాలుగునెలల చిన్నారి ఉన్నారు. ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్

గుంతకల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో రిజర్వేషన్ తొలి చార్ట్ తయారీ సమయాన్ని పెంచుతూ దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైలు బయలుదేరే 4 గంటల ముందు రిజర్వేషన్ తొలి చార్ట్‌ను సిద్ధం చేసి, రైలు బయలుదేరే అర గంట ముందు రెండో చార్టును ప్రకటిస్తున్నారు. దాన్ని సమర్థిస్తూ దక్షిణ మధ్య రై. జోన్ నిబంధనలను అమలుపరిచింది. ఇకపై రైలు బయలుదేరే సమయానికి 8 గంటల ముందు తొలి చార్టును సిద్ధం చేస్తారు. రెండో చార్టు ప్రిపరేషన్ సమయాన్ని యథాప్రకారంగానే కొనసాగించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య సమయాలలో బయలేదేరే రైళ్లకు ముందు రోజు రాత్రి 9 గంటలకే తొలి చార్టును ప్రకటిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 11-59 గంటల మధ్య, తెల్లవారుజాము 12 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్యలో బయలుదేరే రైళ్లకు 8 గంటల ముందు తొలి చార్టును ప్రకటిస్తారు.

జేఎన్‌టీయూలో ఏపీఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

అనంతపురంరూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వీసీ సుదర్శన్‌రావు సోమవారం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య సురేష్‌బాబు అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులు.. సంప్రదించవచ్చన్నారు.

నేడు పుట్టపర్తికి రాజస్థాన్ గవర్నర్ రాక

పుట్టపర్తి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ గవర్నర్ హరిబానుబాగ్డే మంగళవారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గవర్నర్ పుట్టపర్తికి చేరుకుంటారన్నారు. ఆ రోజు పుట్టపర్తిలో బస చేసి, బుధవారం ఉదయం సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు తిరుగు ప్రయాణమవుతారన్నారు. బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్తారన్నారు.

మీ ఓనర్‌ని కలవమను..!

కియ వద్ద వాహన డ్రైవర్లకు బెదిరింపులు

పెనుకొండ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'మీ ఓనర్‌కి ఎన్నిసార్లు చెప్పాలి..? మమ్మల్ని కలవమంటే కలవరు. ఫోన్ చేస్తే ఎత్తరు. మీ ట్రాన్స్‌పోర్ట్ ఎలా జరుగుతుందో చూస్తాం..' అని కియ వద్ద దుండగులు రెచ్చిపోయారు. కార్ల తయారీ పరిశ్రమకు విడి భాగాలు తరలించే ఐచర్ వాహన డ్రైవర్లను బెదిరించారు. వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం దుద్దేబండ సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమ ఎన్వీహెచ్ కంపెనీ వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎన్వీహెచ్ కంపెనీ నుంచి కార్ల పరిశ్రమకు విడి భాగాలను పీఎంకే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ తన వాహనాల్లో తరలిస్తుంటుంది. ఈ కంపెనీ నుంచి కమీషన్‌లు రాబట్టుకునేందుకు దుండగులు బెదిరింపులకు దిగారు. దుద్దేబండ క్రాస్ వద్దకు పీఎంకే వాహనం రాగానే బైకుల్లో సుమారు పదిమంది దుండగులు వచ్చి అడ్డగించారు. డ్రైవర్ ఆనంద్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కున్నారు. 'మమ్మల్ని కలవమని మీ ఓనర్‌కు ఎన్నిసార్లు చెప్పినా కలవరా..?' అని డ్రైవర్‌ను బెదిరించారు. వాహనం అద్దాలను ధ్వంసం చేశారని డ్రైవర్ వాపోయాడు. ఈ సంఘటన జరిగిన అరగంట వ్యవధిలోనే పాలసముద్రంలోని మరో ఐచర్ వాహనాన్ని ధ్వంసం చేశారు. డ్రైవర్ రఫీక్‌ను బెదిరించారు.

పొలాలకు దారి చూపండి

● మహిళా రైతుల డిమాండ్
● తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన


తహసీల్దార్, సర్వేయర్లతో వాగ్వాదానికి దిగిన మహిళా రైతులు

గోరంట్ల, జూలై7(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలంటూ మండలంలోని దిగువగంగంపల్లికి చెందిన మహిళా రైతులు.. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామం నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు పూర్వం నుంచి రోడ్డు ఉందన్నారు. గొల్ల రామకిష్టప్ప సర్వే నంబరు 47లోని రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఏడాదిగా ఇబ్బంది పడుతున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. సమస్యపై తహసీల్దార్ మారుతికి పిర్యాదు చేశారు. సర్వేయర్ తాతయ్యను పిలిపించి రెవెన్యూ రికార్డుల మేరకు దారి చూపాలని ఆదేశించారు. దీంతో మహిళలు ఆగ్రహిస్తూ గతంలో అనేకమార్లు రెవెన్యూ అధికారులు రోడ్డు పరిశీలనకు వచ్చినా, సమస్య పరిష్కారం కాలేదంటూ సర్వేయర్‌పై ధ్వజమెత్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సర్వేయర్‌తోపాటు పోలీసులు వెళ్లాలని తహసీల్దార్ ఆదేశించారు. మహిళా రైతులు అధికారులు వచ్చేవరకు వెళ్లమంటూ అక్కడే భీష్మించారు. దీంతో సర్వేయర్ వెళ్లి, రోడ్డు చూపారు. ఆందోళనలో మహిళా రైతులు ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మమ్మ, అలివేలమ్మ, అనసూయమ్మ, రామచంద్రమ్మ, రజిని, లక్ష్మీనరసమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

అరటి పరిశోధనా కేంద్రానికి స్థల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అరటికి సంబంధించి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు తాడిపత్రి మండలం తలారిచెరువులో కలెక్టర్ వినోద్‌కుమార్, ఢిల్లీ డీఏఎస్‌ఎస్‌ఎల్ ప్రతినిధి పరేష్‌దేశాయ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి జయప్రకాష్ బృందంతో స్థలాన్ని పరిశీలించారు. తలారిచెరువు సర్వేనెంబరు 18లో అనుకూలమైన వాతావరణంగా ఉందని ఇక్కడే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బీఏఎస్‌ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పంటల విత్తనాభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రతిపాదన పంపించామని అన్నారు. ముఖ్యంగా అరటి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధన కేంద్రం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయుటకు అన్నివిధాలా అనుకూలమైన స్థలమని పరిశీలించారు. 50ఎకరాల అరటి టిష్యుకల్చర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలుతీసుకుంటామని కలెక్టర్ వారికి తెలిపారు. ప్రస్తుతం స్థలాలు ఉన్న ప్రాంతంలో నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, రోడ్డు వసతి, నేల సామర్థ్యం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ టిష్యుకల్చర్ అరటి ఉత్పత్తి కేంద్రం ఏర్పడితే రైతులకు నాణ్యమైన పరిశోధనాత్మకమైన పంట మొక్కలు అందించేందుకు అన్నివిధాలా వీలుంటుందని అన్నారు. తాడిపత్రి ప్రాంతం నుంచి అరటిపంట ఎక్కువ సాగు చేయడంతోపాటు వివిధ దేశాలకు పంపించేందుకు రైల్వేసౌకర్యం కూడా ఉందని బృందానికి వివరించారు. కార్యక్రమంలో తెలుగురాష్ట్రాల ప్రతినిధి తివారీ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్, మండల సర్వేయర్ రాంమోహన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

● రాష్ట్ర పరిశీలన బృందం


కదిరి ఎంఈఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం

కదిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కదిరి, నల్లమాడ, తనకల్లు, నల్లచెరువు, తలుపుల మండలాల్లో ఈ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. హాజరు నమోదులో సమస్యలు ఉంటే అప్పటికప్పుడు పరిష్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై ఎంఈఓలు ఉదయం, సాయంత్రం పర్యవేక్షించాలని అన్నారు. 1, 6 తరగతుల్లో అడ్మిషన్ల వివరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎంతమందికి ఇస్తున్నారు, పాఠశాలకు ఎంతమంది హాజరయ్యారన్న విషయాలను తనిఖీ చేశారు. హాజరు నమోదు చేయనివారిపై చర్యలుంటాయని తెలిపారు. ఈ బృందంలో సభ్యులు వి. సువర్ణసరోజ, ఎస్‌కే నాగులమీరా, యేసుబాబు, ప్రకాష్‌రెడ్డితోపాటు కదిరి ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఏడీ-2 వినయ్‌కుమార్‌తోపాటు, అసిస్టెంట్ జీసీడీఓ సంపూర్ణ సోమవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఉచితంగా అందించే శానిటరీ న్యాప్‌కిన్స్ గోడౌన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధులు లోకేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రశాంతి నిలయంలో ఉచిత వైద్యశిబిరం

పుట్టపర్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రశాంతినిలయంలోని ఉత్తర భవనం వద్ద సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ తొలుత సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి, వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 5 రోజులపాటు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రత్నాకర్ తెలిపారు. డాక్టర్ గీతాకామత్, డాక్టర్ అక్షయ్‌కళాతియా ఆధ్వర్యంలో 60 మంది డాక్టర్లు వైద్యశిబిరంలో పాల్గొన్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచన

అనంతపురం వైద్యం, జూలై7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. సోమవారం హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి వ్యాధుల తీవ్రతను గుర్తించాలన్నారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రజాపరిషత్ అధికారులు, సచివాలయాల సిబ్బందికి సమస్యలను వివరించాలన్నారు. ప్రతిగ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, కోదండరామిరెడ్డి, రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, మునాఫ్, తిరుపాలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

చిలుక పలుకు..!




రాత బాగుంటే
రివ్వున ఎగిరేదాన్ని..
పచ్చని చెట్టుపై జంటగా వాలి
కోరిన పండ్లను కొరికి తినేదాన్ని..!

పంజరంలో చిక్కి..
పట్టుకున్నవాడు పలకమన్నట్లు పలికేదాన్నా..?
తలుపు తెరవగానే ఏదో ఓ పేక ముక్క తీసి..
పడేసి వెళుతున్నానేగానీ,
అందులో ఏముందో నాకు మాత్రం తెలుసునా..?

నా జాతకమే బాగుంటే..
రెక్కలుండీ ఎగరకపోదునా..?
ఏదో సరదాకి అయితే ఫరవాలేదు..
నేనేదో తీశానని..
ఇతనేదో చెప్పాడని..
నమ్మి నాశనమైపోతే..
నాకు సంబంధం లేదు..!
(గూగూడు కుళ్లాయి స్వామి క్షేత్రంలో.. సోమవారం)





- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

17 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి స్థానిక నాయక్‌నగర్‌లోని స్మాష్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్ తెలిపారు. బాలబాలికలు, వెటరన్ విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి 2015 జనవరి 1వ తేదీ తరువాత, అండర్-12కి 2013 జనవరి 1 తరువాత, అండర్-15కి 2011 జనవరి 1 తరువాత, అండర్-17కి 2009 జనవరి 1 తరువాత, అండర్-19కి 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా కిట్లు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9440605819 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

జ్యోతిబసు (జయంతి)



పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు కొనసాగి దేశంలో అత్యధికకాలం సీఎంగా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్న జ్యోతిబసు 1914 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. కమ్యూనిస్టు మార్క్సిస్ట్ (సీపీఎం) పార్టీకి చెందిన ఆయన 1977 నుంచి 2000 వరకు వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. అంతకు ముందు ఉపముఖ్యమంత్రిగా పని చేశారు. సీపీఎం పొలిట్‌బ్యూరో నిర్ణయం వల్ల 1996లో ప్రధానమంత్రి అయ్యే అవకాశం కోల్పోయారు. రాజకీయాల్లోకి రాక ముందు ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2010 జనవరి 17న కన్నుమూశారు.

సౌరవ్ గంగూలీ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ సౌరవ్ గంగూలీ 1972 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. టెస్ట్ కెప్టెన్‌గా ఇండియాకు పలు విజయాలు అందించారు. ఎడమచేతితో బ్యాటింగ్, కుడి చేత్తో మీడియం పేస్ బౌలింగ్ చేయగల గంగూలీకి బెంగాల్ టైగర్, కోల్కత్తా యువరాజు, దాదా అనే ముద్దుపేర్లు ఉన్నాయి. 2002 నుంచి 2005 వరకు భారత టెస్ట్ జట్టుకు నాయకత్వం వహించి అత్యధిక టెస్ట్ విజయాలు అందించిన కెప్టెన్‌గా రికార్డు సాధించారు. 2003 వరల్డ్ కప్ క్రికెట్‌లో ఫైనల్ చేరిన భారతజట్టుకు నాయకుడు ఆయనే. 2006 ప్రారంభంలో జట్టునుంచి దూరమైనా డిసెంబరులో మళ్లీ జట్టులోకి ప్రవేశించి 2006-07 దక్షిణాఫ్రికా పర్యటనలో తన ప్రతిభను నిరూపించుకున్నారు. 2008లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యారు. కాగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్‌కు ఐదేళ్లు, 2019 నుంచి 2022 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు. పద్మశ్రీ, అర్జున అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్‌లకు సంబంధించి ఏర్పాటైన జస్టిస్ ముద్గల్ కమిటీ ప్రోబ్‌ప్యానెల్‌లో సభ్యుడిగా సుప్రీంకోర్టు నియమించింది.

అన్నదాసోహానికి 101 ప్యాకెట్ల బియ్యం విరాళం

» నేటి నుంచి కైవారలో గురుపూజా సంగీతోత్సవం



సేకరించిన బియ్యం బస్తాలతో ప్రముఖులు

చింతామణి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని శ్రీక్షేత్రం కైవార యోగి నారేయణ మఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని ఈనెల 8 నుంచి మూడురోజులపాటు సంగీతోత్సవం జరగనుంది. రాష్ట్రం నుంచే కాకుండా సరిహద్దులోని పొరుగురాష్ట్రాల ప్రాంతాల నుంచి కూడా భక్తులు రానున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించే అన్నదాసోహానికి చింతామణి ఏపీఎంసీ మార్కెట్ మాజీ డైరెక్టర్ ఎంఎంఎన్ శ్రీనివాస్, బలిజ సముదాయం ఆధ్వర్యంలో 101 ప్యాకెట్ల బియ్యాన్ని విరాళంగా సేకరించారు. సోమవారం పూజలు చేసి కైవారకు పంపారు. ఈ సందర్భంగా ఫిడేల్ దయానంద్ మాట్లా డుతూ కైవారలో జరిగే గురుపూర్ణిమ సంగీతోత్సవాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు వస్తారన్నారు. మఠం ఆధ్వర్యంలో జరిగే అన్నదాసోహానికి మిత్రులు, బలిజ సముదాయం సభ్యులచే బియ్యం సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వీవీసీ శ్రీనాథ్, వీకే బాబు, హరీశ్, టమోటా మార్కెట్ రవి, ఆర్ఎంజే జయరామప్ప, టమోటా వ్యాపారి చలపతి, గ్యాస్ మురళి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



బాగేపల్లిలో కొలువుదీరిన పీర్లతో భక్తులు

బాగేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సౌహార్ద్రత, భావైక్యతకు నిదర్శనంగా పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా మొహరం వేడుకలు జరిగాయి. పలుచోట్ల పీర్లను కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు. పల్లెల్లో ఈ పండుగను బాబయ్యన హబ్బగా పిలుస్తారు. పరంపర, సాంస్కృతిక వైభవంగా నేటికీ కొనసాగుతోంది. ప్రతి ధర్మంలోనూ కొత్త ఏడాది వేడుకలు ఆచరిస్తారు. హిందూ ధర్మంలో ఉగాది, క్రైస్తవ ధర్మంలో జనవరి 1 తరహాలో ఇస్లాంలో మొహరం నెల మొదటి రోజున కొత్త సంవత్సరంగా పరిగణిస్తారు. అమావాస్య అనంతరం చంద్రదర్శనం రోజునుంచి మొహరం ప్రారంభమవుతుంది. ప్రవక్త హజరత్ మహ్మద్ పైగంబర్ మనుమలు హజరత్ ఇమాం హసన్, ఇమాం హుసేన్‌లు ఇస్లాం ధర్మ రక్షణకు పోరాటం చేశారు. వారి త్యా, బలిదానాలకు ప్రతీకగా హసన్, హుసేన్ అని నినాదాలు చేస్తూ ఊరేగారు. బాగేపల్లి పట్టణంలోని బైలాంజనేయస్వామి దేవస్థానం పక్కన, మల్లసంద్ర, నారేమద్దేపల్లి, మార్గానకుంటె, గూళూరు, జూలపాళ్య, చేళూరు, బిళ్ళూరు సహా పలు ప్రాంతాల్లో పీర్లను కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లింలు సమైక్యంగా మొహరం ఆచరించడం విశేషం. పల్లెల్లో ఈ పండుగలో అత్యధికంగా హిందువులు పాల్గొనడం విశేషం. పీర్లను ఊరేగించే సందర్భంగా పులివేషధారులు డప్పులకు అనుగుణంగా నృత్యం చేశారు. పల్లెల్లో ప్రజలు ఇచ్చే విరాళాలు, పదార్థాలను సేకరించి పీర్లకు సమర్పిస్తారు. పీర్లను ధరించేవారు అగ్నిగుండంపై నడుస్తారు. ఇస్మాయిల్ సాబ్ ఖాద్రి మాట్లాడుతూ మొహరం దుఃఖపు పండుగ అన్నారు. ఈనెలలో ముస్లింలు ధార్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటారన్నారు. పట్టణంలోని మొహరం వేడుకలలో బాబాజాన్, బాబు, రోహిద్, రామకృష్ణప్ప పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం



సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణ

బంగారపేట, జూలై7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె గ్రామంలో కొలువైన కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం, 31వ వార్షికోత్సవం మూడు రోజులపాటు ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త, హైకోర్టు న్యాయవాది జేఎం రాజణ్ణశెట్టి నేతృత్వంలో కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. శుక్రవారం గోధూళి లగ్నంలో గణపతి పూజ, వాసుదేవ పుణ్యాహ వచనం, రక్షాబంధన, కళశారాధన, గణపతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి, మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం సుప్రభాతసేవ, కళశా రాధన, గణపతి హోమం, నవగ్రహ హోమం, పంచసూక్త హోమం, రామతారక హోమం, ఆంజ నేయ హోమం, సుదర్శన హోమం, నరసింహ హోమం, క్షేత్రపాలక హోమం, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, పంచా మృతాభిషేకం, అలంకరణ, అష్టావధాన సేవ, నైవేద్యం, మహామంగళారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ వార్షికోత్స వంలో భాగంగా ఆదివారం బూదికోటె గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల, హైస్కూల్ విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షుడు బీఆర్ మంజునాథ్, మాజీ అధ్యక్షుడు బీ కృష్ణప్ప శెట్టి, వీఎస్ఎస్ఎన్ మాజీ అధ్యక్షుడు విజయ కుమార్, అనుచంద్రశేఖర్, శోభనబాబు, రాజగోపాల్, మునస్వామిశెట్టి, రామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ మాలిని, హైస్కూల్ ప్రిన్సిపాల్ దాక్షాయిణి, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజ్, ప్రధానో పాధ్యాయుడు కులకర్ణి పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్న భోజన ఉద్యోగుల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన ఉద్యోగులు

బాగేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారానికై ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు పిలుపునివ్వడంతో తాముకూడా పాల్గొంటామని మధ్యాహ్నభోజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తఫా తెలిపారు. తాలూకా బీఈఓ వెంకటేశప్ప, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ వెంకటరామ్‌లకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ముస్తఫా మీడియాతో మాట్లాడుతూ ఈనెల 9న తమ విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొంటామన్నారు. మధ్యాహ్న భోజన ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వంగానీ, రాష్ట్రప్రభుత్వంగానీ వేతనాలు పెంచలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమై 24 ఏళ్లు గడిచినా పలు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కనీసవేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. నెలవారీ పించను రూ.10వేలు ఇవ్వాలని, కనీస కూలి అమలు చేయాలని, జాయింట్‌ఖాతా బాధ్యత తొలుత ఉన్నవిధంగానే కొనసాగించాలన్నారు. రిటైరైనవారికి ప్రావిడెంట్ ఫండ్ ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ స్కూళ్లకు ఇస్తున్న తరహాలోనే అన్ని పాఠశాలలకు కోడిగుడ్లు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఉద్యోగులసంఘం పదాధికారులు పాల్గొన్నారు

మహిళలు క్రీడల్లో రాణించాలి: నటి రమ్య



జ్యోతిని వెలిగిస్తున్న నటి రమ్య తదితరులు

బెంగళూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళలు క్రీడలలో రాణించాలని ప్రముఖ నటి రమ్య అభిప్రాయపడ్డారు. క్వీన్స్ ప్రీమియర్ లీగ్ (క్యూపీఎల్) క్రీడోత్సవ లోగోను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీగ్ వ్యవస్థాపకులు మహేశ్‌గౌడ, నటుడు ప్రమోద్‌శెట్టి, బాలీవుడ్ నటి శ్రీఎలి ఎవ్రామాలు పాల్గొన్నారు. మహేశ్‌గౌడ మాట్లాడుతూ గత ఏడాది క్వీన్స్ ప్రీమియర్‌లీగ్ తొలి విడత విజయవంతంగా ప్రజాదరణ పొందిందన్నారు. 12 కొత్త క్రీడలను చేర్చామన్నారు.

ఇవి కేవలం క్రీడాపోటీలు మాత్రమే కాదని మానసిక ఉల్లాసం కలిగించే వన్నారు. క్యూపీఎల్ 1లో 25 మిలియన్లమంది డిజిటల్ సందర్శకులతోపాటు 5వేలమంది ప్రేక్షకులు తిలకించారని, ఈసారి 50 మిలియన్ల డిజిటల్ సందర్శన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రమ్య మాట్లాడుతూ.. మహిళా క్రీడాకారులను, కళాకారులను ప్రోత్సహించడం నాకెంతో ఇష్టమన్నారు. క్రీడల్లో నేరుగా పాల్గొనడం ద్వారా సోషల్‌మీడియా, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరం అవుతారన్నారు. క్యూపీఎల్ 2 పోటీలు సెప్టెంబరులో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి, కరవే వ్యవస్థాపక అధ్యక్షుడు నారాయణగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవం



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న పండితులు



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి అలంకరణ

ముళబాగిలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాణ ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలలో భాగంగా విశేష పూజలు, వేలాదిమందిభక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయశుద్ధి, సుప్రభాతసేవ, దేవతార్చన, నివేదిన, మూల ఆంజనేయస్వామికి అభిషేకం, వెండి వజ్రకవచ ధారణ, నూతన వస్త్రాలు సమర్పించారు. విశేష పుష్పాలంకరణ చేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిత్య హోమాలు, సర్వదైవత్వం, మూర్తి హోమాలు, శ్రీరాముడు, ఆంజనేయస్వామికి, పరివార దేవతలకు పవిత్ర సమర్పణ, నివేదన, మహామంగళారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు హెచ్‌వీ రామకృష్ణమాచార్ నేతృత్వంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పూజా కార్యక్రమాలు జరిగాయి. తహసీల్దార్ వీ గీతా, కార్యనిర్వాహక అధికారి కేవీ సుబ్రమణ్యం, ఆలయ వ్యవస్థాపక సమితి అధ్యక్షుడు ఆర్ఎస్ సుహాస్‌శెట్టి నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి.

క్షుద్రపూజల కలకలం



పూజ చేసిన ప్రాంతాన్ని చూపుతున్న శివకుమార్

గోరంట్ల, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీ గొల్లపల్లి సమీపంలో క్షుద్రపూజలు చేసిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన శివకుమార్ తనకుటుంబంపైనే స్థానిక ప్రజాప్రతినిధి, అనుచరులు ఆదివారం రాత్రి క్షుద్రపూజలు చేశారని ఆరోపించారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద రాతి బండపై ముగ్గువేసి, రంగుదారాలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, జోనికలబంద ఆకులు, మునకాయల ముక్కలతో క్షుద్రపూజ చేశారన్నారు. గ్రామం వద్ద తనకు 2.35 ఎకరాల పొలం ఉందని, సీసీ రోడ్డు ఏర్పాటు విషయంలో తనకు, స్థానిక ప్రజాప్రతినిధికి సీసీరోడ్డు వేయకుండా అడ్డుపడుతున్నారని, తన తండ్రి రామాంజనేయుల పేర్లను నిమ్మకాయపై రాసి, రోడ్డు స్థలంలో పాతిపెట్టి, క్షుద్రపూజలు చేశారని శివకుమార్ ఆరోపించారు. దీనపై ఆ ప్రజాప్రతినిధిని వివరణ కోరగా, క్షుద్రపూజ చేయించారనడంలో వాస్తవం లేదన్నారు. గ్రామాభివృద్ధిని అడ్డుకోవడమేకాకుండా, తనకు అపఖ్యాతి కలిగేలా ప్రవర్తిస్తున్న అతనిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

కన్నుల పండువగా ఉట్ల పరుష



ఉట్ల పరుషకు హాజరైన ప్రజలు

సోమందేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా తొలి ఏకాదశి పండగ సందర్భంగా కమిటీవారు ఉట్లపరుషను ఘనంగా నిర్వహించారు. ఉత్సాహవంతులైన యువకులు బురదమట్టిలో దిగి జారుతున్న స్తంభంపైకి ఎక్కి ఉట్టిని కొట్టే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. దీన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్థులు తరలివచ్చారు. అనంతరం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామక్రిష్ణ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని బాలరెడ్డిపల్లి గ్రామంలో పెన్నానది వడ్డున వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద తొలి ఏకాదశి సందర్భంగా ఉట్లపరుష నిర్వహించారు. సోమవారం పలువురు యువకులు బురదతో ఉన్న స్థంబాన్ని ఎక్కి ఉట్టికొట్టడం పలువురిని ఆకర్షించింది. పెద్దఎత్తున భక్తులు, ప్రజలు హాజరయ్యారు.

పెనుకొండ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని చెరువు రోడ్డులోని దర్గా ఆంజనేయస్వామి ఆలయంవద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉట్లపరుష ఆకట్టుకుంది. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం నిర్వహించిన ఉట్లపరుష అమితంగా ఆకట్టుకుంది.

వైభవంగా ముక్కాంజనేయస్వామి జాతర



జ్యోతులతో వెళ్తున్న మహిళలు

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కుర్లపల్లి గ్రామంలో ఏకాదశి పండగను పురస్కరించుకుని ముక్కాంజనేయ స్వామి జాతర నిర్వహించారు. రొద్దం మండల కుర్లపల్లి గ్రామంలో స్వామివారికి పూజలునిర్వహించి మహిళలు కలశాలతో ఊరేగింపు చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో జాతరలో సందడి సందడిగా నెలకొంది.

నరసింహస్వామి..



రాంపేట నుంచి పాల కడవలతో తరలివస్తున్న భక్తులు

పావగడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మీనకుంటపల్లి గ్రామంలో జోడుకంబాల నరసింహస్వామి జాతర కన్నుల పండువగా సాగింది. తొలి ఏకాదశి, ద్వాదశి అయిన సోమవారం వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు స్వామివారి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాలు, కార్లు, మేకలు, గొర్రెలతో ప్రదక్షణ చేయించడం ఆనావాయితీగా వస్తోంది. మూడు రోజుల నుంచి పస్తులతో ఉండి ఒక్కొక్క వడ్లగింజను చేతితో వలిచి ప్రసాదంచేసి 16 ఆవుల పాలను సేకరించి అప్పల కడవలతో పూజారి తరలిరావడం ఇక్కడి ప్రత్యేకత ఆలయాన్ని మూడు చుట్లు ప్రదక్షణ చేసిన అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం చేస్తారు. మహిళలు జ్యోతులు మోస్తూ తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. తొమ్మిదిగ్రామాల భక్తులు జాతరలో పాల్గొని తమ మొక్కుబడులు తర్చుకున్నారు.

బియ్యం పంపిణీలో అక్రమాలు రుజువైతే చర్యలు



పౌరకార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన దృశ్యం

దొమ్మసంద్ర, జూలై 7(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీలో 1-3 కేజీల బియ్యం తక్కువగా ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఒకవేళ రుజువైతే తప్పక చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి నాగేశ్ హెచ్చరించారు. కొడతి గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన అధ్యక్షులు వీణా రవి బాధ్యతలో పాల్గొని మాట్లాడారు. బీపీఎల్ కార్డు దారులకు ఉచిత బియ్యం, గోధుమలు ఇతర ధాన్యాలు అందాలన్నారు. ఆహార సమస్య తలెత్తరాదనే అన్నభాగ్య పథకం అమలవుతోందన్నారు. రేషన్ పంపిణీలో తేడాను గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సందర్భంగా పౌరకార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. బెంగళూరు తూర్పు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు వీణా రవి, ఉపాధ్యక్షుడు మంజునాథ్, మాజీ అధ్యక్షుడు కృష్ణవేణి, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు రమేశ్‌రెడ్డి, ఆశా చిట్టిబాబు, నారాయణస్వామి (బాబు), మమతా లక్ష్మణ్, నళినాక్షి, నంజుండరెడ్డి, శివకుమార్, సతీశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బొలెరో, ద్విచక్రవాహనం ఢీ.. ఒకరి మృతి

చింతామణి, జూలై7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బట్లహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటరాయనకోటె-చాన్నరాయగడ్డ క్రాస్ మధ్య బొలెరోను వెనుకనుంచి టీవీఎస్ ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవాహన చోదకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రమాదంలో నేరేడుపండ్ల వ్యాపారి, చింతామణి తాలూకా ముంగానహళ్ళికి కిట్టణ్ణ (60) మృతుడిగా గుర్తించారు. కిట్టణ్ణ కొంతకాలంగా యగవకోటె సమీపంలోని కాపల్లి గ్రామంలో ఉంటున్నాడు. ఉదయం టీవీఎస్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టెంపోను తప్పించబోయి ముందు వెళ్తున్న బొలెరోను ఢీ కొన్న ప్రమాదంలో మృత్యువాత చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి నుంచి గురుపూజా మహోత్సవం

శిడ్లఘట్ట, జూలై 7(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని చింతామణి తాలూకాలోని కైవారలో సద్గురు యోగి నారేయణ తాతయ్య గురుపూజా మహోత్సవం మూడురోజులపాటు జరగనుందని శిడ్లఘట్ట నగర యోజనా ప్రాధికార మాజ అధ్యక్షుడు బళె రఘు, కైవార తాతయ్యమఠం సేవాకర్త వేణు తెలిపారు. పట్టణంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 8నుంచి 10వరకు యోగి నారేయణ తాతయ్య గురుపూజా మహోత్సవం ఉంటుందన్నారు. మూడు రోజులపాటు అంటే 72 గంటలపాటు నిరంతర సంగీతోత్సవంలో స్థానిక, రాష్ట్ర, జాతీయ కళాకారులు పాల్గొంటారన్నారు. ఉత్సవంలో భక్తులు పాల్గొని కైవార తాతయ్య కృపకు పాత్రులు కావాలన్నారు.

అభయ మునీశ్వరుడికి విశేష పూజలు




ప్రత్యేక అలంకరణలో అభయ మునీశ్వరుడు

ముళబాగిలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాణ ప్రసిద్ధమైన అంజనాద్రి కొండపై గల అభయ మునీశ్వర స్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవం సందర్భంగా విశేషపూజా కార్యక్రమాలు జరిగాయి. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, వివిధ హోమాలు జరిగాయి. భక్తాదులకు అన్న సంతర్పణ నిర్వహించారు. ఆలయం ముందుభాగాన తోరణాలతో ముస్తాబు చేశారు. ఉత్సవంలో నగరసభ సభ్యుడు గరడి శంకర్, పీఎల్‌డీ బ్యాంకు రిటైర్డు అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణం ఇవ్వలేదని ఆర్డీఓకు ఫిర్యాదు

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): శేషాపురం గ్రామానికి చెందిన సన్నకారు రైతు శకుంతలమ్మ తన మూడెకరాల పొలానికి పెద్దమంతూరు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పంటల రుణం ఇవ్వడం లేదని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మండలంలోని శేషాపురం గ్రామానికి చెందిన శకుంతలమ్మ, చెరుకూరు గ్రామ పరిధిలోని సర్వేనంబరు 19-3లో మూడెకరాల పొలానికి మూడు నెలలుగా పంటలబీమా కోసం తిరిగితే చీదరించుకున్నాడని ఆర్డీఓతో వాపోయారు. వేరే బ్యాంక్‌లో వెళ్తే పెద్దమంతూరు బ్యాంక్ పరిధిలో మాత్రమే లోన్లు తీసుకోవాలని చెప్పగా పెద్దమంతూరు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పదే పదే తిరస్కరిస్తున్నాడని ఆర్డీఓ వద్ద వాపోయింది. దీనిపై రొద్దం తహసీల్దార్‌కు రెఫర్ చేయగా బ్యాంక్ మేనేజర్‌తో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు ఫోన్ ద్వారా సంప్రదించి వెంటనే రుణం మంజూరు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో మంజూరుకు చర్యలు తీసుకుంటామని మేనేజర్ తహసీల్దార్‌కు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.07	1,597.31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	54,550	50.715
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	61,645	263
నీటి నిల్వ (టీఎంసీలు)	76.71	18.25

బైక్‌పై 5300 కి.మీ. ప్రయాణం

● హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ 12 రాష్ట్రాల్లో ప్రయాణం ● కానిస్టేబుల్ రమేష్‌ను అభినందించిన ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ/రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌తో ప్రమాదాలు నివారించవచ్చని, అప్రమత్తంగా ఉండి కుటుంబానికి అండగా నిలవాలని ప్రచారం చేపట్టారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12 రాష్ట్రాల్లో పర్యటించి వాహనదారులకు అవగాహన కల్పించారు. జూన్ 17న బళ్లారి నుంచి కానిస్టేబుల్ రమేష్ స్నేహితులు విశ్రాంత్‌రెడ్డి, సతీశ్ బొమ్మారెడ్డి, ఆడిటర్ రఘుతోపాటు ఢిల్లీకి చెందిన ప్రవీణ్‌రామకృష్ణతో కలిసి శ్రీనగర్, జమ్మూ, కాశ్మీర్,లడఖ్, మనాలి, ఢిల్లీ ,ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్ దాదాపు 12రాష్ట్రాల గుండా ప్రయాణించి అన్ని రాష్ట్రాలలో హెల్మెట్లపై అవగాహన ప్రచారం నిర్వహించారు. హెల్మెట్లతో తమను వారి కుటుంబాలను రక్షించుకోవాలని చాటిచెప్పారు. పోలీసుల భయంతో హెల్మెట్లు ధరించవద్దు.. మిమ్మల్ని మీ కుటుంబాన్ని రక్షించుకోవడానికి ధరించడన్నారు. తన 5300 కిలీమీటర్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న తర్వాత నేరుగా బళ్లారి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శోభారాణిని వారు సోమవారం కలిశారు. ఈసందర్భంగా ఎస్పీ రమేశ్‌ను ఘనంగా స్వాగతించి సత్కరించారు. తమ పోలీస్ సిబ్బంది ఇలాంటి సాహసం చేయడం గర్వకారణమని, వాహనదారులు హెల్మెట్ ప్రాముఖ్యతను అర్థం చేసుకుని తప్పనిసరిగా ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.

ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తనకు బైక్ రైడింగ్ అంటే ఎప్పుడు ఒక హాబీ దానిని అర్థవంతంగా చేయాలనే ఉద్దేశంతో హెల్మెట్‌పై అవగాహన ప్రచారాన్ని నిర్వహించామన్నారు. తన ఆశయానికి ఎస్పీ ఎంతగానో సహకరించారన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎందరినో చూసి చలించానన్నారు. ఈసందర్భంగా మంజునాథ్, విరూపాక్షయ్య, సుమ, రమేశ్, సునీల్ కుమార్, చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజ్, షబ్బీర్ , గోవిందరాజ్, మాజీ సైనికోద్యోగి ఈశ్వర రెడ్డితదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ రమేష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ శోభారాణి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీ,ఎస్పీ తదితరులు

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

● ముఖ్యమంత్రి మీడియా సలహాదారు ప్రభాకర్

బళ్లారి సిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నా, పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో ఉందని ముఖ్యమంత్రి మీడియా సలహాదారు ప్రభాకర్ అన్నారు. సోమవారం రాష్ట్ర, జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన 'ప్రెస్ డే' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మీడియా ఉనికి పత్రికా స్వేచ్ఛపై ఆధారపడి ఉంటుందని, పత్రికా స్వేచ్ఛ ఇప్పుడు చాలా ప్రమాదంలో ఉందన్నారు. 2024 పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం 151వస్థానంలో ఉందని, గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే పత్రికా స్వేచ్ఛ క్షీణతతో పాటు భారతదేశం కూడా వాక్ స్వాతంత్ర్య సూచికలో 109వ స్థానానికి పడిపోయిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారతదేశంలో ఈ క్షీణతల గురించి విలేకరులు తీవ్రంగా ఆలోచించాలన్నారు. భారతీయ జర్నలిజానికి విశిష్టమైన చరిత్ర ఉందని, స్వాతంత్ర్య పోరాటం నుంచిప్రజాస్వామ్య ఏకీరణ వరకు చరిత్ర అంతటా ఇది గణనీయమైన పాత్ర పోషించిందన్నారు. రాజ్యాంగం లౌకిక పోషలిజం విలువలను తొలగించడానికి క్రమబద్ధమైంది. ఈ రెండువిలువలు మన రాజ్యాంగానికి జీవనాడి ఈ జీవనాడిని కాపాడుకోవడంలో మీడియా దృఢంగా నిలిబడాలన్నారు. ఈసందర్భంగా డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు, వార్తాధికారి తుకారం, రాష్ట్ర కార్యదర్శిలోకేశ్, మేయర్ ముల్లంగి నందీశ్ ఈసందర్భంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివానంద్ తగడూర్,గృహనిర్మాణ మంత్రి మీడియాసలహాదారు లక్ష్మీనారాయణ సహా జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సంఘం వీరభద్ర గౌడ, మేటీ శశిధర్, చౌదరి, గౌడ, నరసింహమూర్తి, వెంకోబి. రవికుమార్, ప్రభాకర్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు. మీడియా సలహాదారుడు, కోఆర్డినేటర్ ప్రభాకర్‌ను బళ్లారి కాంగ్రెస్ మీడియా ఇన్‌ఛార్జ్ వెంకటేష్ హెగ్డే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వెంకటేష్ హెగ్డే తదితరులు

పబ్లిక్ కొళాయిల్లో

కలుషిత నీరు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థుల ఆగ్రహం

బళ్లారి సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సండూర్ తాలూకాలోని వడ్డు గ్రామం ఎస్సీ కాలనీలో పబ్లిక్ కొళాయిల్లో తాగు నీటి కలుషితంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొళాయి నీటితో వ్యాధులు వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామపంచాయితీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో లక్ష లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్ ద్వారా కాలనీ ప్రజలకు చాలా రోజులుగా తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ఈనీరు కలుషితమైందని, ప్రజలు జలుబు, జ్వరం, దగ్గు, శరీర నొప్పులతో బాధపడుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీకి నీరు సరఫరా చేసే ఎగువ స్థాయి ట్యాంకర్‌ను సకాలంలో శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కాలనీకి కలుషిత నీరు నిరంతరం సరఫరా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అన్ని నీటి ట్యాంకర్లను వెంటనే శుభ్రం చేయాలని కోరుతున్నారు.



కలుషిత నీటిని చూపుతున్న గ్రామస్థుడు

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనవాండ్లపల్లికి చెందిన ముంతాజ్ అనే మహిళ సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. సుబహాన్ భార్య ముంతాజ్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది చీమలు, బొద్దికంలకు ఉపయోగించే లక్ష్మణరేఖ ద్రావకాన్ని తాగి అస్వస్థకుగురయ్యారు. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ తేజస్వినీ చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వాహనంలో హిందూపురం తరలించారు.

గడువు పొడిగింపు

హోస్పేట, జూలై 7(ఆంధ్రజ్యోతి):2025-26 సంవత్సరానికి మైనార్టీవర్గాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులకు ప్రొఫెషనల్ శిక్షణ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును జూలై 21 వరకు పొడిగించినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, జైన్, బౌద్ధ, సిక్కు, పార్సీ వంటి మైనార్టీవర్గాలకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులు స్కాలర్‌షిప్ పొందాలనుకునే వారు జూలై 21లోపు దరఖాస్తు ఫారంను అంబేడ్కర్ సర్కిల్ సమీపంలోని గుగ్రి నర్సింగ్ హోమ్ సమీపంలోని ఎస్ఎంఎస్‌కే ప్లాజాలో ఉన్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలి, లా డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులై మైనార్టీ వర్గానికి చెందిన అభ్యర్థులు అయి ఉండాలి. దరఖాస్తులు స్వీకరించడానికి నిర్ణయించిన చివరి తేదీ నుంచి 2సంవత్సరాల వ్యవధిలో లా డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే శిక్షణకోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఉంది. దరఖాస్తులు సమర్పించడానికి నిర్ణయించిన చివరి తేదీ నాటికి అభ్యర్థి వయస్సు 30 సంవత్సరాలు మించకూడదు. వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు మించకూడదు.

పాఠశాలల అభివృద్ధికి సహకారం ప్రశంసనీయం

● విశ్వనాథ్ చౌదరిని ఆదర్శంగా తీసుకోవాలి
● విద్యాశాఖాధికారి బసవలింగప్ప హుడేద్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

బళ్లారి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజం కీలకపాత్ర పోషించాలని, గోడతి నాగేశ్వరనాథ్ ఛారిటబుల్ ట్రస్టు పాఠశాల అభివృద్ధి కోసం పాఠశాలను దత్తత తీసుకోవడం ప్రశంసనీయమైన చర్య అని ఏరియా విద్యాశాఖాధికారి బసవలింగప్ప హుడేద్ అన్నారు. సోమవారం తాలుకాలోని ముల్లూరు క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలోని దివంగత గోడతి నాగేశ్వరనాథ్ 30వ జయంతి సందర్భంగా మొక్కలు నాటడం, పిల్లలకు యూనిఫారమ్‌లు, నోట్ పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవలింగప్ప మాట్లాడుతూ ఇది ఒక ఆదర్శప్రాయమైన పని అని, ప్రభుత్వ పాఠశాల పిల్లలో వారి పిల్లల జ్ఞాపకాలను చూడటం, ఆ పిల్లలు చదువుకునే పాఠశాల నమూనాను అభివృద్ధి చేయాలనే ఆలోచన అద్వితీయమన్నారు. వారికనుగుణంగానే మన ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువ అభివృద్ధి, విద్యా పురోగతిని చూస్తున్నాయి. తాలుకా కమ్మ సంఘం అధ్యక్షుడు బి హర్ష మాట్లాడుతూ నిస్వార్థసేవకు కంకణాలు ధరించిన చేతులు తాలుకాలో చాలా ఉన్నాయన్నారు. అమరేగౌడ మల్లాపూర్, సురేష్ నెక్కంటి పచ్చదనాన్ని పెంచే పనితో సహ వివిధ పనులకు చాలామంది ముందుకు వచ్చారు. వారు ప్రపంచంలో లేరు. ఇప్పుడు తన కుమారుడు పేరు మీద ఉన్న పాఠశాలను దత్తత తీసుకున్న విశ్వనాథ్ చౌదరి, ఇది ఇతరులకు ఒక ఉదాహరణ అన్నారు. కాకతీయ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, సీఆర్‌పీ షణ్ముఖగౌడ మాట్లాడారు. అఖండ భూమి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ నెక్కంటి, వనసిరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అమరేగౌడ మల్లాపూర్, గౌరవ అధ్యక్షులు శంకరగౌడ ఎలె కూడ్లిగి, గ్రామసభ్యులు అమరేగౌడ, మహేష్ బసబా, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మణప్ప నాయక, జర్నలిస్ట్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముల్లూరు క్యాంపులోని ప్రభుత్వ పాఠశాలలో గోడాతి నాగేశ్వర రావు జయంతిలో భాగంగా విజయ ఫొటో స్టూడియో పాఠశాలను దత్తత తీసుకుని చిన్నారులకు యూనిఫారమ్, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బీఈఓ బసవలింగప్ప, బి హర్ష, అఖండ భూమి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ నెక్కంటి వనసిరి ఫౌండేషన్ అధ్యక్షులు అమరేగౌడ పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘననివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, స్థానికులు

సిరుగుప్ప, జూలై7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ జగ్జీవన్ రామ్ దేశానికి ఉత్తమ సేవలందించారని తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం, టిప్పుసుల్తాన్ సర్కిల్ వద్ద వున్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దళితనాయకులు గంగప్ప, రఫీక్, వివిధ సంఘాల పదాధికారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన 'ఆషాఢ నాట్యసంభ్రమం'



ప్రశంసా పత్రాలు అందుకున్న కళాకారులు

బళ్లారి సిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి) తొలిఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కమ్మింగ్ రోడ్డు పాండు రంగ దేవస్థానం ఆవరణలో నిర్వహించిన 'ఆషాఢనాట్యసంభ్రమం' కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సమూహ నృత్యం, ఏకపాత్రాభినయం, వాద్యప్రదర్శన సంగీతాలాపన, భక్తులను తన్మయపరిచాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు ప్రశంసాపత్రాలను అందించి సన్మానించారు. తుంగ-గంగా కళాసంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి రామచంద్ర, శివరుద్రయ్య, డ్యాన్స్ మాస్టర్ బసవరాజ్, దేవాలయ ధర్మకర్త వెంకోబిరావు, నాగభూషణం, పాల్గొన్నారు.

యాష్ పాండ్‌లో నీరు పిచికారి

కంప్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని వద్ద వుండే కేపీసీఎల్‌లోని యాష్ పాండ్ నుంచి దుమ్ము ధూళి రాకుండా, రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు వాటర్ స్ప్రింక్లర్లు చేశారు. ఈ సందర్భంగా కేపీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ కుడితిని తిమ్మాపురం, దరోజీ గ్రామాల ప్రజలు ప్రయాణికులకు యాష్‌పాండ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమకు గమనించి రావడంతో వెంటనే ఆ ప్రాంతంలో వాటర్‌పైపులు ఏర్పాటు చేశామన్నారు. వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా, కూలీలతో వాటర్ పైపులతో యాష్ పాండ్‌లో దుమ్ముధూళిని అరికడుతున్నామన్నారు. ఎక్కువ గాలి వుండటంతో యాష్ ఆరిపోవడం వల్ల ఆ ప్రభావానికి ధూళి ఏర్పడుతుందన్నారు. వర్షం వచ్చినట్లయితే ఎలాంటి ఇబ్బందులు వుండే వర్షం రాకపోవడంతో కాస్త ఇబ్బందులు ఏర్పడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకపై ఎలాంటి సమస్య వుండదన్నారు. ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళలో యాష్ పాండ్‌లో నీటిని పిచికారి చేస్తామన్నారు.



నీరు చల్లుతున్న కూలీలు

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి: మంత్రి భోసరాజు

రాయచూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రక ప్రదేశాల సుందరీకరణ పనులు జనం మెచ్చేలా ఉండాలని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు సూచించారు. స్థానిక సెంట్రల్ బస్‌స్టాండ్ సమీపంలో చేపట్టిన కందకం అభివృద్ధి పనులను సోమవారం మంత్రి భోసరాజు అధికారులతో కలిసి పరిశీలించారు, అక్కడ జరుగుతున్న పనుల పురోగతి గురించి జిల్లాధికారి నితీశ్, మహానగర పాలిక కమిషనర్ జెబిన్ మొహపాత్రలు మంత్రికి వివరించారు. అనంతరం కాటే దర్వాజా, తీన్ ఖందిల్ ప్రదేశాలను పరిశీలించిన మంత్రి, ఇప్పటికే సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నారని పనుల్లో ఎలాంటి రాజీకి అవకాశం లేకుండా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మంత్రి భోసరాజు

వైభవంగా పీర్ల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సిరుగుప్ప, జూలై7(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా పీర్లదేవుళ్ల ఊరేగింపు శుక్రవారం జరిగింది. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పీర్లదేవుళ్లకు ప్రూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం పీర్లదేవుళ్లను పట్టణంలో దేశనూరు రోడ్డు మార్గంలో చిన్న కాయగూరల మార్కెట్ యార్డు ఆవరణంలో ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపు తిలకించడానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల ప్రజలు తమ అనుకూలం వున్న చోట నదిలో వాగులు, చెరువుల వద్ద పీర్లదేవుళ్లను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ సంతోష్ చౌహాన్ ఆధ్వర్యంలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్ బందోబస్తు నిర్వహించారు.

హోసూరు జోన్

ఘనంగా ద్రౌపదీదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హోసూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపాన ఉలగామి గ్రామంలో వందేళ్లనాటి ద్రౌపదిదేవి ఆలయంలో నిర్వహించిన ద్రౌపది దేవి, అర్జునుడి తిరుకల్యాణ వైభోగం సంబరంగా సాగింది. 8 గ్రామాలకు చెందిన భక్తులు కావడినృత్యం చేశారు. ఉలగామి, భోగిపురం, రామాపురం, కుందట్టి, కూలియం, కొత్తకురికి, కెత్తూరు. మీసకంపట్టి గ్రామస్తులు ఆలయంలో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవంలో శివపార్వతుల కళాకారుల నృత్యం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఇతర కళాకారులు కూడా పాల్గొని భక్తులను ఉత్తేజపరిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఊరేగింపులో బాణాసంచా కాల్చారు. మహాభారత సన్నివేశాలు గుర్తు చేశారు. ద్రౌపదీదేవి కల్యాణోత్సవం అనంతరం భక్తులు నిప్పులపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



శివపార్వతుల వేషధారణలో కళాకారులు



భూమిపూజలో అధికారులు, స్థానిక ప్రముఖులు

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

హోసూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కెలమంగలం యూనియన్‌లోని మేడగ్రహారం పంచాయతీ కడవరహళ్ళి వార్డులో పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 95మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు ప్రహరీగోడ, శౌచాలయం నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సెల్వరాజం పాఠశాల సమస్యలపై డెల్ కంపెనీ సీఎస్ఆర్‌లో భాగంగా ప్రహరీగోడ, శౌచాలయం చేపడుతుందని బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు లేఖ రాయగా అందుకు కలెక్టర్ దినేశ్‌కుమార్ అనుమతించారు. రూ.20లక్షల విలువైన పనులను డెల్ గ్రూప్ సీఎస్ఆర్ విభాగం మేనేజర్ భాస్కర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ మేనేజర్‌లు మాణిక్యం, హరిహరన్, పంచాయతీ మాజీ అధ్యక్షుడు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మునీశ్వర దేవాలయ కుంభాభిషేకం

హోసూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు - హోసూరు జాతీయ రహదారిమార్గంలో మారుతినగర్ వద్ద వందేళ్ల నాటి మునీశ్వర ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఇందులో భాగంగా ఆదివారం గంగపూజ, గణపతిపూజ, కళశపూజ నిర్వహించారు. సోమవారం ఉదయం గణపతి పూజ, కళశపూజ, నవగ్రహ హోమం, రుద్రహోమం, కుంభాభిషేకం నిర్వహించారు. స్థానిక భక్తులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.



కుంభాభిషేకంలో భక్తులు

వీధినాటకం, జానపద సంగీత బృందాల ఎంపికకు

దరఖాస్తుల ఆహ్వానం

● సమాచార శాఖ అధికారి ధనుంజయ



హోస్పేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): వీధి నాటకాలు, జానపద బృందాల ద్వారా ప్రభుత్వం పథకాలను ప్రచారం చేయడానికి కళా బృందాలను ఎంచుకోవడానికి సమాచార, ప్రజా సంబంధాల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ధనుంజయ సోమవారం విలేకరులతో తెలిపారు. వీధి నాటకం, జానపద సంగీత కార్యక్రమాల నిర్వహణను సులభతరం చేయడానికి ప్రతి జిల్లా నుంచి 3 వీధి నాటకం, 3 జానపద సంగీత కళా బృందాలను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకునే బృందాలు రిజిస్టర్ సంస్థలు అయి ఉండాలని, నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. ప్రతి వీధి నాటక బృందంలో 8 మంది కళాకారులు ఉంటారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉండాలి, ఒకరు షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగకుచెందిన కళాకారిణి అయి ఉండాలన్నారు. ప్రతి జానపద సంగీత కళా బృందంలో 3 కళాకారుల ఉంటారు, వారిలో ఒకరు మహిళ ఉండాలి, ఒకరు షెడ్యూల్ కులం, షెడ్యూల్ తెగకుచెందిన కళాకారిణి అయి ఉండాలన్నారు. కళా బృందాలను ఎంపిక చేయడానికి జిల్లా స్థాయిలో కన్నడ సాంస్కృతిక శాఖ, సాంఘీక సంక్షేమం, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వ్యవసాయ శాఖల జిల్లాస్థాయి అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆగస్టు 12, 2025 ఉదయం 11 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఎంపిక ప్రక్రియ ఏర్పాకాలంలో జరుగుతుంది.అర్హత కలిగిన కళాబృందాలు విజయనగరంలోని సమాచారం శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి నిర్దేశించిన దరఖాస్తు ఫారంను ఆగస్టు 5లోపు సమర్పించాలన్నారు.